## క్లుప్తంగా

### గుడుంబా పట్టివేత

**ఆత్మకూరు :** మండలం నుంచి ఇతర గ్రామాలకు రావాణా చేస్తున్న గుడుంబాను నీరుకుళ్ల క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేలకుంట గ్రామానికి చెందిన గుగులోతు రాజు ద్విచక్రవాహనంపై 20 లీటర్ల గుడుంబా రవాణా చేస్తుండగా పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారని తెలిపారు. దీని విలువ రూ.6 ఉంటుందని తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

### కుటుంబ సభ్యులకు అప్పగింత



**పరకాల :** ఇంట్లో గొడవ పడి వెళ్లిపోయిన తల్లి, కొడుకుల ఆచూకీ తెలుసుకున్న పోలీస్‌లు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన నగల వ్యాపారి కందుకూరి సత్యనారాయణ భార్య స్వర్ణలత ఇంట్లో గొడవపడి తన 11 ఏళ్ల కుమారుడు కార్తికేయతో ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆందోళన చెందిన ఆమె తల్లిదండ్రులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీస్‌లు.. బస్టాండ్ నుంచి వెల్లంపల్లి రోడ్డు వైపు కాలినడకన వెళ్తున్నట్లు గుర్తించారు. పరకాలకు సుమారు 22 కిలోమీటర్ల దూరంలోని అంబాల గ్రామంలో ఉన్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### ఎస్సైకి సన్మానం

**శాయంపేట :** ఎస్సై జక్కుల పరమేశ్‌ను మండలంలోని గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎస్సైకి వివరించారు. గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనర్, కో కన్వీనర్లు, పాల్గొన్నారు.

### టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఎన్నిక



సుధాకర్, అధ్యక్షుడు



రాజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి

**హన్మకొండ :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్–143 హనుమకొండ జిల్లా నూతన కమిటీని నియమించారు. ఆదివారం కమిటీని యూనియన్ రాష్ట్ర కోశాధికారి, ఎన్నికల అధికారి యోగానంద్ ప్రకటించారు. అధ్యక్షుడిగా మస్కపురి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా అర్షం రాజ్‌కుమార్, కోశాధికారిగా పొగాకుల ప్రభాకర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా గోకారపు శ్యామ్ కు మార్, బొడిగే శ్రీనివాస్, బి.కర్నాకర్, దుంపల ప వన్, దేవేందర్, ప్రశాంత్, ఎస్.సదానందం, కే.రంజిత్, సంయుక్త కార్యదర్శులుగా బి.రాజేందర్, మైదం సుధాకర్, జె.శ్రీనివాస్, బి.ధన్‌రెడ్డి, ఆదర్శ్ కుమార్, శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా సూర్యప్రకాశ్, రంజిత్, రాంబాబు, చేతి శ్రీనివాస్, రాజు, నరేందర్‌ను నియమించినట్లు ప్రకటించారు.

### ఫార్మసీ విద్యార్థులకు భవిష్యత్

**మామునూరు :** ఫార్మసీ విద్యార్థులు సాంకేతిక పరి జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్ అందుకుంటారని వాగ్దేవి విద్యాసంస్థల కార్యదర్శి కరస్పాండెంట్ సీహెచ్.దేవేందర్‌రెడ్డి సూ చించారు. ఆదివారం వరంగల్ బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో జేఎన్టీయూ, కేయూ అనుబంధ ఫార్మసీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఉత్తమ ఫార్మసీ విద్యార్థులకు దే వేందర్‌రెడ్డి ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జి.కమల్‌యాదవ్, డాక్టర్ ఎం రాధాకిషన్, సిహెచ్.వాహిని, శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

### గుట్కాల స్వాధీనం

**మడికొండ :** నిషేధిత పొగాకు గుట్కాలను అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ నిమిత్తం మడికొండ ఇండస్ట్రీయల్ ఏరియాలో వెళ్లగా అక్కడ ఉన్న కిరాణం షాపుల్లో తనిఖీ చేయగా రాజస్థాన్‌కు చెంది న మనోజ్‌కుమార్ షాపులో రూ.2,660, పప్పురా మ్ షాపులో రూ.2,300 విలువ గల నిషేధిత గు ట్కాలు లభించినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిషన్ తెలిపారు.

### వైభవంగా వేమన జయంతి

**హన్మకొండ :** హనుమకొండ టీఎన్జీవోస్ కాలనీ–2లో ఆదివారం త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీ వేమన భగవాన్ జయంతి వేడుకలను వైభవంగా జరుపుకొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# కమ్మని కంకులు..

- నోరూరిస్తున్న స్వీట్‌కార్న్
- రహదారికిరువైపులా విక్రయాలు
- ఇష్టపడి తింటున్న వాహనదారులు



సాగు చేసిన స్వీట్‌కార్న్ మొక్కజొన్న పంట



స్వీట్‌కార్న్ పచ్చికంకులు



రాతి గిన్నెలో ఉడకబెడుతున్న స్వీట్‌కార్న్

**ఎల్కతుర్తి:** మొక్కజొన్న కంకులను చూస్తేనే నోరూ తోంది. నిప్పు సణికలపై కాల్చిన కంకులకంటే మట్టి కుండలో ఉడకబెట్టిన కంకులపై పలువురు మక్కువ చూపుతున్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు.. పక్కనే ఉడకబెట్టిన కంకులు కనిపిస్తే వాహనాలను ఆపి బేరం ఆడుతున్నారు. అయితే స్వీట్‌కార్న్‌ను జనాలను చాలా ఇష్టపడుతున్నారు.

**మలబద్ధకాన్ని నిరోధించే గుణం**

తెలంగాణ రాష్ట్రంలో మక్కకంకులుగా పిలుచుకునే వీటిని ఇతర రాష్ట్రాల్లో మొక్కజొన్న కండెలుగా పిలుచుకుంటుంటారు. అయితే ఇందులో విటమిన్స్‌తో పాటు పీచు పదార్థం అధికంగా లభిస్తుంది. ఇది మానవుల్లోని మలబద్ధకాన్ని సంపూర్తిగా నిరోధించే గుణం మొక్కజొన్న కంకులకు ఉందని వైద్యులు చెబుతుంటారు. వర్షాకాలంలో, చలి కాలంలో ఎక్కువగా సాగయ్యే ఈ మొక్కజొన్న కంకులు ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అయితే ఈ మొక్కజొన్న కంకుల్లో రెండు రకాలు ఉంటాయి. మామూలు మొక్కజొన్న కంకులు, స్వీట్‌కార్న్ పేరుతో వచ్చే కంకులు మరోరకంగా చెప్పుకోవచ్చు.

**స్వీట్‌కార్న్‌పై మక్కువ**

అయితే ఇదివరకు మొక్కజొన్న కంకులను కాల్చి అమ్మేవారు. ప్రస్తుతం ఆ పద్ధతి కాస్త కొత్త పుంతలు తొక్కాయి. ఈ కంకుల స్థానాన్ని స్వీట్‌కార్న్ కంకులు ఆక్రమించాయి. మామూలు కంకులను కొనుగోలు చేసేందుకు జనం ఇష్టపడడం లేదు. ఎందుకంటే వాటికంటే ఎక్కువ రుచితో మరింత విటమిన్లతో నోరూరించే స్వీట్‌కార్న్ కనిపించడడమే కారణమని చెప్పవచ్చు. అయితే స్వీట్‌కార్న్ గింజలు ఇంతకు ముందు సినిమా హాళ్లలో, వ్యాపార కేంద్రాల్లో మాత్రమే కనిపించేవి. రైతులు స్వీట్‌కార్న్‌ను సాగు చేయడంతో సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చాయి.

**రోడ్డుకిరువైపులా విక్రయాలు**

స్వీట్‌కార్న్ పంటలు పెద్దమొత్తంలో సాగు చేస్తున్నారు. రోడ్డుకిరువైపులా కాల్చిన కంకులు రూ.10కి ఒకటి విక్రయిస్తుంటే, స్వీట్‌కార్న్ కంకులను రూ.15కు ఒకటి చొప్పున విక్రయిస్తున్నారు. రైతుల వద్ద నుంచి కంకులను కొనుగోలు చేసుకున్న పలువురు కాల్చి, ఉడకబెట్టి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. రాతెండి పాత్రల్లో, మరి కొందరు మట్టి పాత్రలు, కుండల్లో స్వీట్‌కార్న్ కంకులను ఉడకబెట్టి విక్రయిస్తుండడంతో రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు ఉల్లాసంగా గడుపుతూ స్వీట్‌కార్న్ రుచి చూస్తున్నారు.

# మల్లన్న ఆలయంలో భక్తుల సందడి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



పట్నాలు వేస్తున్న భక్తులు

**ఐనవోలు :** మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు జాతరలో భాగంగా తొలి ఆదివారం అవడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో ఆరంభం కాగా నిత్య కైంకర్యాలు శైవ ఆగమ పద్ధతిలో అర్చకులు నిర్వహించారు. భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేసి వారి పితృదేవతలను పూజించారు. బోనం వండి అమ్మవారికి సమర్పించి కోడెను కట్టి, శావతీసి (రథ సేవ) మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు ఒడి బియ్యం, శారె సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు.

# సర్వేలో భాగస్వాములు కావాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి



మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

**శాయంపేట :** ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల పంపిణీకి అర్హుల ఎంపిక కోసం సర్వే చేపట్టినట్లు తెలిపారు. అధికారుల వద్ద ఉన్న జాబితాలో పేరు లేని అర్హులు దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఈనెల 21 నుంచి 25 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నారని, అక్కడ కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సాగు భూములకే రైతు భరోసా ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా మొదటి విడతలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వడం, భూమి లేకుండా ఉపాధి హామీ పని చేసుకునే నిరుపేదలకు ఆర్థిక భరోసా ఇవ్వడం, పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు ఇవ్వడం వంటి పథకాలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రపాణి, రవీందర్, కుమారస్వామి, రమేశ్, భాస్కర్, డీటీరెడ్డి, కృష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, పైడి, జగన్, భిక్షపతి, చంద్రమౌళి పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

**నయీంనగర్ :** అధికారుల పనితీరు, ప్రజల సహకారంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం 53వ డివిజన్ విజయగణపతి, విద్యారణ్యపురి, శంకర్ నగర్ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం నాటికి నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీల్లో వర్షపు నీరు నిలవకుండా చేస్తానన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కావ్య మహేందర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, పల్లె రాహుల్‌రెడ్డి, కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తొటం ఝాన్సీరాణి, రవీందర్, పల్లకొండ సతీష్, రవీందర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ముందుకు రావాలి

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

**వర్ధన్నపేట :** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు ముందుకు రావాలని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆకాంక్షించారు. మండలంలోని బొక్కలగూడెంలో ఎస్ఎల్ఐటీ, ఆక్యులోర్ స్టాటిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన రూ.2 లక్షల విలువైన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంపెనీ ఉద్యోగులు, యాజమాన్యం గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించే దిశగా చొరవ చూపడం అభినందనీయమని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధికి మించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి, రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దాతలు సైతం ముందుకొస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను దాతలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు దిలీప్‌రాజ్, దాతలు సంతోశ్, మమత, శివకవి, లింగమ్మ, చంద్రయ్య, సందీప్, ప్రత్యూష, రాఘవేందర్, శ్రీలత, వంశీ, వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

**నియోజకవర్గ కేంద్రంలో సమస్యల తిష్ట**

**వర్ధన్నపేట :** వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయని తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేసింది.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



ఎంజీఎం: ఎంపీ కడియం కావ్యను సన్మానిస్తున్న ఐఎంఏ ప్యానెల్ సభ్యులు

**విద్యారణ్యపురి :** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం హనుమకొండలో ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్, రాష్ట్ర బాధ్యులు నున్న నర్సమ్మ, బోనగిరి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు రెడ్డి వాసుదేవరెడ్డి, బాధ్యులు డాక్టర్ లక్కిరెడ్డి సత్యం, ఉమారాణి, వెంకటేశ్వర్లు, రాజమౌళి, సుధాకర్, మల్లికార్జున్, తిరుమలేష్ పాల్గొన్నారు.

**ఎంపీ కావ్యను కలిసిన ఐఎంఏ బాధ్యులు**

**ఎంజీఎం :** ఇటీవల నూతనంగా నియమితులైన వరంగల్ జిల్లా ఐఎంఏ ప్యానెల్ బాధ్యులు, అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ ఎంపీ కడియం కావ్యను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం కలిసికట్టుగా ఉండడానికి ఐఎంఏకి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో కార్యదర్శి డాక్టర్ అజిత్ మహ్మద్, కోశాధికారి శిరీష్‌కుమార్, వరంగల్ జిల్లా తానా (తెలంగాణ హాస్పిటల్స్– నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్) అధ్యక్షుడు ముక్క దిలీప్ కుమార్, ఐఎంఏ ప్రెసిడెంట్ ఎలక్ట్ మన్మోహన్ రాజ్, టీజీఎంసీ సభ్యులు, ఐఎంఏ జిల్లా ఉపాధ్యక్షులు, వరంగల్ తానా కోశాధికారి వి.నరేష్ కుమార్, దివిజ, తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారి సన్నిధిలో ఎంపీ**

**హన్మకొండ కల్చరల్ :** శ్రీభద్రకాళి దేవాలయాన్ని ఆదివారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శేషు భారతి, అర్చకులు ఎంపీని ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. అమ్మవారికి పూజలు నిర్వహించుకున్న అనంతరం ఎంపీ కావ్యకు అర్చకులు తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు.

# డంపింగ్ యార్డు పొగతో తీవ్ర ఇబ్బందులు

**మడికొండ:** మడికొండ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుతో మడికొండ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కొన్నేళ్లుగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మడికొండ, రాంపూర్, ఎల్కతుర్తి గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ముందుగా గ్రామస్తుల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. ముందుగా ఒక కార్యాచరణ రూపొందించి ఒక అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేసి ముందుకు వెళ్తామని ప్రజలు పేర్కొన్నారు. త్వరలోనే ఒక కమిటీని ఎస్‌డీఎల్‌సీ రిటైర్డ్ ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టు స్వామి నేతృత్వంలో గ్రామాలకు చెందిన కొంతమంది పేర్లను నమోదు చేశారు.

## మంద కృష్ణమాదిగను దూషించడం సరికాదు



**దామెర :** ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను మాలమహానాడు సంఘం నాయకుడు పసుల రామ్మూర్తి దూషించడం సరికాదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పసుల రామ్మూర్తిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. మాదిగ జాతికి పసుల ప్రవీణ్ వెంటనే క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. మంద కృష్ణమాదిగను దూషించిన అతడిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, రాజేందర్, శరత్, ప్రణీత్, ప్రశాంత్, సురేష్, డేవిడ్, సురేష్, శ్రీను, ప్రసాద్, రమేశ్, రాకేష్ పాల్గొన్నారు.

**పరకాల :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మెస్పీ అనుబంధ దండోరా కళాకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ, మాదిగ డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోగిల రవి, మాదిగ కళామండలి జిల్లా కార్యదర్శి రామంచ రాజేందర్, రమేశ్ పాల్గొన్నారు.

## ‘కడియం’పై విమర్శలు సరికాదు

**వేలేరు :** స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శలు చేయడం సరికాదని వేలేరు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులను మొదలుపెట్టిందే బీఆర్ఎస్ పార్టీ అని గుర్తుంచుకోవాలని అన్నారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, బుచ్చిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గంగుల రణధీర్‌రెడ్డి, అనిల్, శ్రీకాంత్, ఆసీఫ్ పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**కమలాపూర్ :** మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (19) శనివారం అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీన మండలానికి చెందిన ఓ యువతి ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం బంధువుల, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# దాడి చేసిన దుండగులను శిక్షించాలి

**వరంగల్ :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కంబాలపల్లి రాములుపై దాడికి పాల్పడిన దుండగులను వెంటనే శిక్షించాలని టీపీటీఎఫ్ అధ్యక్షుడు ఊటుకూరి అశోక్, ప్రధానకార్యదర్శి వీరస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాములుపై జరిగిన మూకుమ్మడి దాడిపై జనవరి 12న తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం జరిగిందని అన్నారు. అందులో వివిధ ఉపాధ్యాయ సంఘాలు పాల్గొని దాడులకు పాల్పడ్డ వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి నిరసనగా జనవరి 20న ఉపాధ్యాయులందరూ పాఠశాలలకు నల్లబ్యాడ్జీలు ధరించి హాజరుకావాలని పిలుపునివ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని రాష్ట్రంలోని 23 ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# మానుకోటకు తరలివెళ్లిన ఉద్యమకారులు



మానుకోటకు తరలివెళ్తున్న ఉద్యమకారులు

**శాయంపేట :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు ఆదివారం మానుకోటలో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల జైత్రయాత్ర సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కో కన్వీనర్ పాడిశెట్టి గణేశ్ జెండా ఊపి వాహనాలను ముందుకు కదిలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీ 250 చదరపు గజాల స్థలంతో పాటు రూ. 25వేల పెన్షన్ వెంటనే అమలు చేయాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి గుర్తింపుకార్డులు ఇవ్వాలని, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి రవీందర్, ఉద్యమకారుల ఫోరం మండల నాయకులు పాల్గొన్నారు.

# లక్ష డప్పులు, వేల గొంతులు వినిపించాలి

- ప్రజా కవి మిట్టపల్లి, మాజీ ఎమ్మెల్యేలు




ధర్మసాగర్ : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**ధర్మసాగర్ :** ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హైదరాబాదులో ఫిబ్రవరి 7న చేపట్టనున్న లక్ష డప్పులు వేల గొంతుల భారీ ప్రదర్శన, మహాసభను జయప్రదం చేయాలని ప్రజా కవి, రచయిత మిట్టపల్లి సురేందర్, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, కాసిపేట లింగయ్య పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని వెయ్యి స్తంబాల గుడి నుంచి చేపట్టే సంఘీభావ ర్యాలీని విజయవంతం చేసేందుకు ముందస్తుగా ధర్మసాగర్ మండల కేంద్రంలో మాదిగ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం డప్పు కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం అనేక పోరాటాలు చేసి చివరి దశకు తీసుకొచ్చారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని మంద కృష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమానికి వివిధ కుల సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు ఇవ్వడం గర్వకారణమన్నారు. వర్గీకరణ అమలు కోసం హైదరాబాదులో నిర్వహించతలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతుల బహిరంగ సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, జర్నలిస్టులు కొట్టే శ్రీనివాస్, కొట్టే లెనిన్, సుధాకర్, బొడ్డు కరియప్ప, పప్పుల్ కుమార్, బొల్లెపాక రాజేశ్, విజయ్, సునీల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పుట్ట భిక్షపతి, గంగారపు శ్రీనివాస్, బొడ్డు శాంతి సాగర్, వివిధ పార్టీల నాయకులు ప్రభుదాస్, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

**శాయంపేట :** ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వేల గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శనను దళితులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవింద్ రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో డప్పులతో ప్రచారం చేపట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రమేశ్, ప్రసాద్, రాజ్‌కుమార్, రాకేశ్, రాజేందర్, శరత్, హరీష్, చిరంజీవి, సతీష్, ప్రశాంత్, నితిన్, ఉదయ్, డేవిడ్, శ్రీకాంత్, సురేష్, డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

**హసన్‌పర్తి :** పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సముద్రాల రాంనర్సింహాచార్యులు కోరారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భీమారం యూనిట్ సమావేశం ఆదివారం జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి రాంనర్సింహాచార్యులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ ఈహెచ్ఎస్ సెంటర్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆయా విభాగాలకు చెందిన వైద్యనిపుణులు లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లు సుధాకర్, శోభ, సమ్మిరెడ్డి, కమల, సూర్యప్రకాష్‌లతో పాటు ముఖ్యఅతిథిని శాలువలతో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీరన్న, అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి కమలాకర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు శంకర్‌రావు, రఘుపతి, వెంకన్న పాల్గొన్నారు.